పచ్చిక కాదిది.. పసర్లెత్తిన నీరు!



చెరుకుపల్లి మండల కేంద్రం సంపత్‌బాబు కాలనీలో పట్టణాన్ని తలపించే రీతిలో తొలిసారి నిర్మించిన అపార్టుమెంట్ ఇది. దీంతో స్థానికంగా స్థిరాస్తి వ్యాపారం జోరందుకుని రూ.లక్షల విలువైన స్థలాలు నేడు రూ.కోట్లు పలుకుతున్నాయి. ఇటీవలి వర్షాలకు ఈ దీని ఎదుట ఖాళీ స్థలంలో నీరు చేరింది. ఈ చిత్రంలో పచ్చగా కనిపిస్తోంది పచ్చిక అనుకుంటే పొరబడినట్లే. మురుగునీరు నిలిచి అందులోని జలచరాల వ్యర్థాలు, కప్పలు గుడ్లు పెట్టడం వల్ల నీరు పసర్లు తేలి పచ్చగా మారింది. ఎప్పటికి ఇక్కడి మురుగు సమస్య వీడుతుందో అని స్థానికులు చర్చించుకుంటున్నారు. – న్యూస్‌టుడే, చెరుకుపల్లి గ్రామీణ

50,503 మిర్చి బస్తాల విక్రయం

గుంటూరు: స్థానిక మిర్చియార్డుకు రైతులు శుక్రవారం 43,523 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 50,503 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 19,806 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,200-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-11,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-17,000, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.10,000-15,000, తాలు మిర్చికి రూ.5,000-10,500 ధర లభించింది.

మిర్చి రుణాలు
ఎవరికెరుక?



- సహకార బ్యాంకులో కొల్లగొట్టిన రూ.కోట్లు
- రెండు నెలలు దాటినా పూర్తి కాని విచారణ

మిర్చి రుణాల బాగోతంపై విచారణ ఇంకా కొలిక్కి రాలేదు. బాధ్యులెవరో బయటపెట్టనూ లేదు. అక్రమాల వెనుక ఆనాటి వైకాపా నేతల ప్రమేయం, ఒత్తిడి ఉందన్న ఆరోపణల నేపథ్యంలో విచారణ ఇంకా కొలిక్కి రాకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణాధికారులపై ఏమైనా ఒత్తిడి ఉందా? కావాలనే జాప్యం చేస్తున్నారా? అన్నది అంతుబట్టడం లేదు.

ఈనాడు–అమరావతి

శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి రైతుల పేర్లతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న యజమానులు వాటిని తిరిగి చెల్లించని వైనం. . పైగా మిర్చిని అమ్మేసుకున్న ఉదంతాలు. ఒక శీతల గోదాములో పెట్టిన మిర్చికి రైతులకు తెలియకుండానే రెండు బ్యాంకుల్లోంచి రుణాలు పొందిన వ్యవహారాలు బయటకొచ్చిన సంగతి తెలిసిందే. ప్రధానంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు శాఖ కేంద్రంగా భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. శీతల గోదాముల్లో నిల్వ చేసిన మిర్చికి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నుంచి రూ.164 కోట్ల రుణాలు తీసుకోగా.. ఒక్క నల్లపాడు బ్రాంచి పరిధిలోనే రూ.116 కోట్ల వరకు అప్పులిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక విచారణ జరిపారు. పోలీసులు సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అంతర్గతంగా విచారణాధికారిని నియమించి విచారణ చేయిస్తోంది. అయితే తొలి ఘటన జులై 29న జరిగింది. ఇప్పటి వరకు విచారణ పూర్తికాకపోవడం గమనార్హం. ఒకే బ్యాంకు పరిధిలో రూ. 116 కోట్ల రుణాలు మంజూరు కావడం వెనుక నాటి వైకాపా నేతల ప్రమేయం ఉందన్న బలమైన ఆరోపణలొచ్చాయి.

ఏం జరుగుతోంది..?

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నల్లపాడు, గురజాల శాఖల పరిధిలో రుణాల మంజూరు వ్యవహారంపై విచారణకు ఒక సీనియర్ అధికారిని నియమించారు. బ్యాంకుకు సంబంధించి రూ. కోట్ల సొమ్ము ముడిపడి ఉండడం, మరోవైపు రైతుల పేర్లతో గోదాముల యజమానులే రుణాలు తీసుకున్నారని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో యుద్ధప్రాతిపదికన విచారణ జరిపి, అసలు విషయం తేలిస్తే.. రుణాల రికవరీతోపాటు తప్పులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేది. ఇప్పటివరకు విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వకపోవడంతో బ్యాంకు వైపు నుంచి ఎలాంటి చర్యలు మొదలుకాలేదు. ❖ మరోవైపు నల్లపాడు బ్రాంచి పరిధిలోని అక్రమాలపై సహకార శాఖ ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టింది. నెల దాటినా ఎలాంటి ఫలితం లేకుండా ఉంది.

❖ ఇంకోవైపు పోలీసుల దర్యాప్తు కూడా కొలిక్కి రాకపోవడం గమనార్హం. అక్రమాలు బయటపడ్డ రోజు ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడి వీలైనంత తొందరగా రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అయినా అధికారుల్లో స్పందన లేకపోవడం గమనార్హం. ❖ ఎవరిస్థాయిలో వారు మాకెందుకులే అన్న ధోరణితో వ్యవహరిస్తుండడం వల్లనే విచారణ ముందుకు సాగడం లేదు. ఈలోగా అప్రమత్తమైన అక్రమార్కులు వ్యవహారాలను చక్కబెట్టుకునే పనులను వేగవంతం చేశారు. మిర్చి నిల్వ పేరుతో తీసుకున్న రుణాల బకాయిలు చెల్లించి తప్పులు జరగలేదని చూపడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోరా?

జీడీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల గడువు ముగిసినా ఇంకా చెల్లించాల్సిన బకాయిలు రూ. 25 కోట్ల వరకు ఉన్నాయి. సకాలంలో వసూలు కాకపోతే అందుకు అనుగుణంగా సమీక్షించి తదుపరి చర్యలు తీసుకోవాలి. భారీస్థాయిలో అక్రమాలు బయటపడ్డా బ్యాంకు ఉన్నతాధికారులు మేల్కొనకపోవడం గమనార్హం. జీడీసీసీబీ చేతికానితనాన్ని ఆసరాగా తీసుకున్న అక్రమార్కులు ఎప్పటికప్పుడు మోసాలు చేస్తూనే ఉన్నారు. గత వైకాపా పాలనలో బ్యాంకు రుణాల్లో చోటుచేసుకున్న అక్రమాలపై ఇప్పటికే సీబీఐకి సైతం ఫిర్యాదులు వెళ్లాయి. అయినప్పటికీ బ్యాంకు ఉన్నతాధికారులు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నల్లపాడు బ్యాంకు శాఖలో రుణాల మంజూరులో జరిగిన అక్రమాలపై బ్యాంకు సీఈవో కృష్ణవేణిని వివరణ కోరగా విచారణ నివేదిక ఇంకా రాలేదన్నారు.



కొల్లూరు నుంచి ఆవులవారిపాలెం మధ్య దారి కనిపించనంతగా గుంతలు



పెసర్లంక వద్ద రహదారి పొడవునా..



పెదలంక వద్ద మడుగు కాదు.. రోడ్డే..

లంక దారులు.. నరకానికి నకళ్లు

దారి కనిపించనంతగా పూర్తిగా గుంతలతో అధ్వానంగా ఉన్న ఈ రహదారి బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలో కృష్ణానది తీరంలో పదుల సంఖ్యలో లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి. సారవంతమైన భూములు, పాడి పశువులతో రాష్ట్రానికి అత్యధిక పాలు, పంట దిగుబడినందించే లంక గ్రామాల అభివృద్ధిని గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసిందనడానికి ఈ చిత్రాలే నిదర్శనం. వైకాపా హయాంలో అయిదేళ్లుగా కనీస మరమ్మతులు చేయకపోవడంతో కొల్లూరు నుంచి లంకగ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారింది. తట్ట మట్టి పోసే దిక్కులేక రహదారి మధ్యలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. సాగుకు కావలసిన విత్తనాలు ఎరువులు పంట దిగుబడిని మార్కెట్‌కు తరలించేందుకు నిత్యం వందల వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారుల గతి మార్చాలని రైతులు, వాహనదారులు కోరుతున్నారు. **– ఈనాడు, కొల్లూరు**

నిధుల జోడింపుతో ప్రగతి పథం: గొట్టిపాటి

అంబడిపూడి(అద్దంకి), న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ నిధులకు ప్రభుత్వ నిధులు జతచేస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బల్లికురవ మండలం అంబడిపూడిలో శుక్రవారం జరిగిన పల్లె పండగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు ఎంపీడీవో కుసుమకుమారి అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల పాటు పరిపాలనలో ఉన్న వైకాపా నేతలు గ్రామాల అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రహదారులు ఛిద్రమయ్యాయని, భవనాల బిల్లులు చెల్లించని కారణంగా అసంపూర్తిగా నిలిచినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అభివృద్ధి పనులు వేగంగా జరిపిస్తున్నామన్నారు. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లను తొలిసారిగా 43 వేలకు పైగా విడుదల చేశామని, పెండింగ్ లేకుండా అందరికీ ఇస్తామన్నారు. భారీ వర్షాల కారణంగా గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, వాటిని మరమ్మతులు చేసేందుకు కొండమట్టితో చదును చేయించాలని సూచించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్నారు. మూడు పనులకు రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షలు వెచ్చించి సిమెంటు రోడ్లు నిర్మించనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ మాధవరెడ్డి మంత్రికి వివరించారు. కార్యక్రమంలో విద్యుత్తు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, సర్పంచి కుసుమకుమారి, స్థానిక నేతలు మలినేని గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, దద్దాల అంజయ్య, మాజీ సర్పంచి మందలపు సుధాకర్ పాల్గొన్నారు.



గ్రామసభలో ప్రజల అభ్యర్థనలు ఆలకిస్తున్న మంత్రి

నేటికీ తెరుచుకోని మూడు మద్యం దుకాణాలు

వేమూరు, న్యూస్‌టుడే: తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మద్యం విధానం అమల్లోకి తెచ్చి, లాటరీ పద్ధతి ద్వారా ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలను కేటాయించిన సంగతి తెలిసిందే. వేమూరు నియోజకవర్గంలో ఆయా మండలాల్లో భట్టిప్రోలు - 5, కొల్లూరు - 4, వేమూరు - 3, చుండూరు - 3, అమృతలూరు - 2 దుకాణాల చొప్పున మొత్తం 17 మద్యం దుకాణాలను లైసెన్స్ దారులు దక్కించుకున్నారు. ఈ దుకాణాల్లో ఈనెల 16 నుంచి మద్యం అమ్మకాలు చేపట్టాల్సి ఉండగా, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు దుకాణాలు శుక్రవారం వరకు తెరుచుకోలేదు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో దుకాణాలు ఎక్కడ పెట్టాలనే విషయమై లైసెన్స్ దారులు ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. వేమూరు మండలం చావలిలో దుకాణం వద్దని స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో ఆబ్కారీ శాఖ సిబ్బంది దుకాణానికి తరలించిన మద్యాన్ని సైతం గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన మద్యం దుకాణంలో ఉంచి భద్రపరిచారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షానికి చెందిన కొందరు నాయకులు వాటా అడగడం వల్లే దుకాణాలు తెరవని పరిస్థితి ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై ఆబ్కారీ శాఖ సీఐ రవిని సంప్రదించగా చావలిలో దుకాణం ఏర్పాటుకు స్థానికులు అభ్యంతరం చెబుతున్న విషయం వాస్తవమేన్నారు.

శిక్షణ రద్దుకు ఉపాధ్యాయుల డిమాండ్

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధించే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి నిర్వహించ తలపెట్టిన ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ బడుగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాపట్లలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ గత నెలలో ప్రభుత్వం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో శిక్షణ కార్యక్రమం వద్దని తమ అభిప్రాయాన్ని తెలియజేశామన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్న విద్యాశాఖ అధికారులు రాష్ట్రంలోని 26 జిల్లాలకు కలిపి 9 కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయటం సరికాదన్నారు. ఇప్పటికే పాఠశాల సముదాయం సమావేశాల్లో శిక్షణ ఇస్తున్నారని ఉపాధ్యాయులకు మళ్లీ ప్రత్యేకంగా శిక్షణ అవసరం లేదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించి శిక్షణ రద్దు చేయాలని కోరారు. ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి సీహెచ్‌టీవీ సురేష్, ఉప ప్రధాన కార్యదర్శి జె.వినయ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం, కో ఛైర్మన్లు ఎన్.సురేష్ బాబు, సీహెచ్‌వీ కుమారి, ఎస్‌కే ఘన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

లాభం మూడింతలు పూయించేలా..

- ప్రయోగాత్మకంగా అధిక సాంద్రతతో పత్తి సేద్యం
- ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకం

ప్రధాన వాణిజ్య పంట పత్తి కొన్నాళ్లుగా ఒడుదొడుకులు ఎదుర్కొంటోంది. గులాబీ రంగు పురుగు, చీడపీడలతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడంతో రైతులు సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. వాస్తవానికి మిగతా పంటలతో పోల్చినప్పుడు పత్తి మొక్క అధిక తేమ పరిస్థితి, అధిక వేడి వాతావరణాన్ని తట్టుకునే లక్షణం కలిగి ఉంది. ఇందులోని అనుకూల సుగుణాలను కాపాడుకుంటూ ప్రతికూల అంశాలను అధిగమించి సేద్యాన్ని గిట్టుబాటుగా మార్చడానికి అధిక సాంద్రత విధానం అనే ఒక నూతన ఒరవడికి జాతీయ పత్తి పరిశోధన స్థానం శ్రీకారం చుట్టింది. మొక్కల సంఖ్యను మూడు రెట్లకు పెంచి తద్వారా అధిక దిగుబడి సాధించడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రయోగాత్మక సాగుకు ముందుకొచ్చే రైతులకు ఆర్థికసాయం అందించి ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది నుంచి లాంఫామ్‌లోని శ్రీవెంకటేశ్వర పశు వైద్యవిద్యాలయం కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగు జరుగుతోంది. నాగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పత్తి పరిశోధన సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. లామ్ ఫామ్ కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు విత్తనాలు నాటడం నుంచి పత్తి తీసే వరకు వివిధ దశల్లో అవగాహన కల్పిస్తోంది.

ఈనాడు, బాపట్ల

సంప్రదాయ సాగు విధానంలో ఎకరాకు 7 వేల పత్తి మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 20 వేల మొక్కలు సాగు చేస్తారు. ఈ విధానంలో మొక్కల సంఖ్య పెరిగినప్పుడు గాలి, వెలుతురు ప్రసరించక కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం ఏర్పడకుండా మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగకుండా రసాయనాలను చల్లుతారు. అవసరాన్ని అనుసరించి పంట కాలంలో 40-45, 55-65 రోజుల వ్యవధిలో రసాయనాలు పిచికారీ చేస్తారు. సారవంతమైన నేలలు, అధిక వర్షపాతం వల్ల మొక్కలు ఎక్కువగా పెరిగితే మూడోసారి కూడా రసాయనాలు చల్లాల్సి ఉంటుంది. దీంతోపాటు 150 రోజులకు పంట పూర్తయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటారు. పశువులు, ట్రాక్టర్లతో అంతరసేద్యం చేయడానికి అనువుగా మధ్యలో ఖాళీ అలాగే ఉంచి వరుసల్లో మాత్రం మొక్కల మధ్య దూరాన్ని తగ్గిస్తారు.



నూతన విధానంలో సాగు చేసిన పత్తి పైరు

ఈ పరిజ్ఞానాన్ని ఇప్పుడిప్పుడే రైతుల్లోకి తీసుకెళ్తున్నారు. పత్తి పంట ఐదారు నెలలకు పైగా దీర్ఘకాలికంగా సాగులో ఉంటుంది. ఈకారణంగా నవంబరు, డిసెంబరు మాసాల్లో సంభవించే అధిక వర్షాలు, తుపాన్లకు చేతికొచ్చిన పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. అధిక సాంద్రత విధానంలో పండించడం వల్ల సాగు సమయం 150 రోజులకు పరిమితం చేయవచ్చు. దీంతో తుపాన్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఏకపంటగా పత్తిని సాగు చేసే పరిస్థితి నుంచి డిసెంబరులో రెండో పైరుగా శనగ, మొక్కజొన్న, పొగాకు తదితర స్వల్పకాలిక పైర్లను వేసుకోవడానికి అవకాశం ఏర్పడటం కర్షకులకు కలిసివస్తుంది.

రైతుల ఆదాయం పెంచడంలో తోడ్పాటు

రైతుల ఆదాయం పెంచడంలో అధిక సాంద్రత విధానం ఎంతగానో తోడ్పడుతుంది. ప్రస్తుతం పత్తిలో గులాబీ రంగు పురుగు సమస్యగా ఉంది. బీటీ విత్తనాల రాకతో పంటకు 120రోజుల వరకు గులాబీ రంగు పురుగు ఆశించదు. దీనిని దృష్టిలో ఉంచుకుని పంట కాలం తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. అధిక సాంద్రత విధానంలో పంట కాలం తగ్గడంతో పాటు తీతల సంఖ్య కూడా తగ్గుతుంది. ఈ విధానాన్ని ప్రోత్సహించడానికి నాగపూర్‌లోని జాతీయ పత్తి పరిశోధన స్థానం వారు ఎకరానికి రూ.5వేలు చొప్పున రైతుకు గరిష్ఠంగా 4 ఎకరాలకు ప్రోత్సాహం ఇస్తున్నారు. ఈ విధానంలో సాగు చేయడానికి 625 ఎకరాల్లో సాగు చేయడానికి రైతులు ముందుకొచ్చారు. నేరుగా వారి ఖాతాల్లోకి ప్రోత్సాహక సొమ్ము జమచేస్తున్నాం. రూ.31.25 లక్షల సొమ్ము సాగుదారులకు అందుతోంది.

- డాక్టర్ యుగంధర్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే



'నొప్పి' తెలియడం లేదా?

- ❖ జీజీహెచ్‌లో మార్ఫిన్ మాత్రల కొరత
- ❖ ఏడాదిగా సరఫరా లేని వైనం

గుంటూరు, న్యూస్‌టుడే: క్యాన్సర్ తీవ్రంగా ముదిరిన దశలో ఎదురయ్యే పెద్ద సమస్య తీవ్రమైన నొప్పి. దీన్ని సమర్థంగా తగ్గించే 'మార్ఫిన్' మాత్రలు సర్వజనాసుపత్రిలో అందుబాటులో లేవు. గతేడాదిగా ఇదే పరిస్థితి. దీని ఖరీదు కేవలం రెండు రూపాయలే. ఇవి విజయవాడలో మాత్రమే దొరుకుతాయి. వీటిని అమ్మాలంటే ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి అవసరం. వైద్యులు ప్రత్యేక నమూనాలో రోగులకు సిఫార్సు చేస్తేనే వీటిని ఇస్తారు. రెండేళ్ల కిందట సర్వజనాసుపత్రికి ఈ మాత్రలు సరఫరా చేసిన గుత్తేదారుకి బకాయిలు చెల్లించలేదు. దీంతో సరఫరా ఆపేశారు. సర్వజనాసుపత్రిలో నిధులు అందుబాటులో ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల సకాలంలో చెల్లించకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా రోగులే నష్టపోతున్నారు.

❖ క్యాన్సర్ వ్యాధిని నయం చేయడం కష్టమైనప్పుడు రోగిని ఆ స్థితిలో వదిలేయకుండా తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కోసం ఈ మార్ఫిన్ మాత్రలను ఇస్తుంటారు.

❖ మన రాష్ట్రంతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన రోగులు చివరి దశలో గుంటూరు సర్వజనాసుపత్రికి వస్తున్నారు. వీరిని అక్కున చేర్చుకుని చికిత్స అందించేందుకు వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు. మాత్రల కొరత వల్ల వీరు సైతం ఏమీ చేయలేకపోతున్నారు.

❖ దీనిపై సంబంధిత అధికారి మాట్లాడుతూ ఇటీవలే గుత్తేదారుకు కొంత మొత్తం చెల్లించామని, మిగిలిన బకాయిలు చెల్లించేందుకు దస్త్రాన్ని సిద్ధం చేశామని తెలిపారు.

కేళి కంకులతో కలవరం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వరిలో మండలంలోని పల్లెకోన, కోనేటిపురం, సూరేపల్లి గ్రామాల్లో కేళి కంకులు రావడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో కావాల్సిన విత్తనాలను రైతులే శుద్ధి చేసుకుని నారుమడులు వేసేవారు. ప్రస్తుతం కంపెనీ విత్తనాలకు అలవాటు పడ్డారు. నాసిరకం విత్తనాలు కావడంతో కేళికంకులు వచ్చాయని పేర్కొన్నారు. ముందుగానే రావడంతో కోతల సమయానికి కంకులు రాలి పోతాయని వాపోతున్నారు. ఈ ఏడాది ఎన్నో కష్టాలకోర్చి పంటను పండించారు. కేళి కంకులు రావడంతో పంట పొట్ట దశకు వచ్చే సమయానికి దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. విత్తనాల్లో లోపం ఉండటం వల్లే ఇలా కంకులు వస్తాయని ఆరోపిస్తున్నారు. పంట చేతికొచ్చే సమయానికి వెచ్చించిన పెట్టుబడులైనా రావని మదనపడుతున్నారు. సంబంధిత అధికారులు పైర్లను పరిశీలించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ అధికారి మీరయ్య మాట్లాడుతూ రైతులు ఏ కంపెనీ విత్తనాలు వాడారో తమ వద్దకు వచ్చి బిల్లులు చూపిస్తే ఎందుకు వచ్చాయో పరిశీలిస్తామన్నారు.



పల్లెకోనలో ఓ రైతు పొలంలో వచ్చిన కేళికంకులు

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం 32 పతకాలతో తమిళనాడు అగ్రస్థానంలో, తరవాత స్థానంలో కర్ణాటక ఉంది. ఆతిథ్య జట్టు 8 పతకాలు సాధించింది. తెలంగాణ 10 పతకాలతో రాణించింది. ❖ అండర్-20 పురుషుల 200 మీటర్ల పరుగు పందెంలో ఏపీ క్రీడాకారుడు శెట్టి లోహిత్ మూడో స్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో 3వేల పరుగు పందెం పోటీలో చంద్రశేఖర్ ప్రసాద్ బంగారు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో వికాస దాసరి రెండో స్థానంలో నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో తెలంగాణ క్రీడాకారులు రెండో స్థానంలో నిలవగా..ఏపీ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో మహిళల 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ఏపీ క్రీడాకారిణులు మూడో స్థానంలో నిలిచారు. ❖ అండర్ 18 పురుషుల విభాగం 200 మీటర్ల పరుగుపందెంలో శేషు దుడ్డు, 1000 మీటర్ల పరుగుపందెంలో వెంకటరత్నం రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. తెలంగాణకు చెందిన మహేష్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.



హార్డిల్స్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారులు

అగ్రశ్రేణి వాస్కులర్ నిపుణుల నుండి వెరికోస్ వెయిన్స్ చికిత్స కోసం సంప్రదించండి.
AVIS HOSPITALS ®
విజయవాడ లో
డా. రాజా.వి. కొప్పాల
(వాస్క్యులర్ & ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్)
అందుబాటులో ఉంటారు
తేది 20-10-2024
సమయం: ఉ. 10.00 గం.ల నుండి మ. 1.00 గం. వరకు
యూనిటి హాస్పిటల్ (విజయ ఆర్థోపెడిక్)
చెరుకుపల్లి వారి వీధి, గవర్నర్ పేట్, విజయవాడ
అపాయింట్‌మెంట్ నమోదుకు
9989 527 715

(c) eenadu

బోల్తా పడిన నీటి ట్యాంకరు

గుడిపూడి రోడ్డులో ప్రయాణమంటే గుబులే


అధ్వానంగా ఈతేరు-గుడిపూడి రోడ్డు


మూడడుగులపైగా లోతున గుంతలివిగా..

బాపట్ల, న్యూస్‌టుడే

మండల పరిధిలోని ఈతేరు-గుడిపూడి పంచాయతీరాజ్ రోడ్డులో వేగేశన ఫౌండేషన్‌కు చెందిన నీటి ట్యాంకరు శుక్రవారం బోల్తాపడింది. డ్రైవరు తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ రహదారి అత్యంత దారుణంగా తయారైంది. రోడ్డుపై ఎక్కడ చూసినా గుంతలే దర్శనమిస్తున్నాయి. రహదారి కుంగి ప్రమాదభరితంగా ఉంది. బాపట్ల-కర్లపాలెం మండలాలను అనుసంధానం చేసే రోడ్డు ఇది. గుడిపూడి వెళ్లటానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఏకైక మార్గం ఇదే. భారీ గోతుల్లో రాకపోకల సమయంలో వాహనాలు కుదుపునకు లోనవుతున్నాయి. వాహనాలు బోల్తా పడి వాహనచోదకులు గాయపడుతున్నారు. రాత్రిళ్లు రాకపోకలు సాగించటం నరకప్రాయంగా ఉంది. కనీసం రహదారిపై పెద్ద గోతులనైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ జేసీ మోహనరావును ప్రశ్నించగా అత్యవసర మరమ్మతులు చేపట్టి రోడ్డు గోతులను పూడ్చి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకుంటామన్నారు.


ప్రమాదానికి గురైన ట్యాంకరు

పురపాలక రక్షిత నీటి పథకానికి భారీ లీకు

20 వేల లీటర్ల నీరు నేలపాలు ● నేడు బాపట్లలో సరఫరా బంద్

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలో చిల్లరగొల్లపాలెం వద్ద పురపాలక రక్షిత నీటి పథకం ప్రధాన పైప్‌లైన్ దెబ్బతిని భారీ లీకు ఏర్పడి శుక్రవారం 20 వేల లీటర్లకు పైగా నీరు వృథా అయింది. ఎంఆర్‌నగర్ నుంచి చిల్లరగొల్లపాలెం, కలెక్టరేట్ క్యాంపు కార్యాలయం మార్గం వరకు ప్రధాన పైప్‌లైన్‌కు పలుచోట్ల లీకులు పడి తాగునీరు నేలపాలవుతోంది. బాపట్ల-గుంటూరు రోడ్డు పక్కన ఏజీ కళాశాల వ్యవసాయ క్షేత్రం ప్రహరీ వద్ద పైప్‌లైన్ బాగా దెబ్బతిని లీకు పెద్దదైంది. వేల లీటర్ల నీరు వృథాగా పోవటంతో శివారు కాలనీలైన ఏఆర్ నగర్, ఏకేనగర్, ప్యాడిసన్‌పేట, టీచర్స్ కాలనీ, రైలుపేట, గులాంహుస్సేన్‌తోట, దేవుడి మాన్యం, ఉమ్మారెడ్డి సరోజనీదేవి కాలనీ, ఆనందనగర్, ఇమ్మడిశెట్టిపాలెం పడమర సత్రం, కుమ్మరపాలెం, దర్శిపెదమస్తాన నగర్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం కొళాయిల ద్వారా అరకొరగా నీరందింది. భారీ లీకు ఏర్పడటంతో పట్టణానికి కొళాయిల ద్వారా నీటి సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు పురపాలక కమిషనర్ తెలిపారు. ప్రజలు పరిస్థితిని అర్థం చేసుకుని సహకరించాలని కోరారు. దెబ్బతిన్న పైపును తొలగించి కొత్త పైప్ వేసే పనులు చేపట్టారు. శుక్రవారం రాత్రికి మరమ్మతులు ఇంకా పూర్తి కాలేదు. శనివారం నాటికి పనులు పూర్తి చేసి ఆదివారం ఉదయం నుంచి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని పురపాలక అధికారులు తెలిపారు.


చిల్లరగొల్లపాలెం వద్ద నేలపాలవుతున్న నీరు

వెయ్యి మందికి ఉద్యోగ కల్పనే ధ్యేయం

అద్దంకి, న్యూస్‌టుడే: యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని పురపాలక కమిషనర్ డి.రవీంద్ర అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అసిస్ట్ సేవా సంస్థ సహకారంతో ఈనెల 29న అద్దంకిలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ర.భ.శాఖ అతిథి గృహంలో శుక్రవారంఆవిష్కరించారు. 25 కంపెనీలు ఇందులో భాగస్వాములవుతాయని, పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న వారికి ఉపాధి కల్పిస్తారన్నారు. కనీసం వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నట్లు చెప్పారు. ఎంపీడీవో బి.సింగయ్య, అసిస్ట్ కార్యదర్శి జాష్టి కృష్ణ, తెదేపా నేత నాగినేని రామకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, నాయకులు కె.అనిల్, కె.అశోక్ పాల్గొన్నారు.


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు, నేతలు

క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు

బాపట్ల, న్యూస్‌టుడే: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. ప్రపంచ పాలియేటివ్ కేర్ వారోత్సవాల సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు నిర్వహించిన అవగాహన ప్రదర్శనలో ఆమె శుక్రవారం మాట్లాడారు. పాలికేర్ విధానం ద్వారా క్యాన్సర్ రోగులకు నొప్పి తెలియకుండా చికిత్స చేస్తారన్నారు. వృద్ధులకు రోగ నిర్ధారణతో సంబంధం లేకుండా సేవలందించాలని పేర్కొన్నారు. చికిత్స విధానంపై కుటుంబ సభ్యులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తామన్నారు. డీఐవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రదర్శనలో డీఎంహెచ్‌వో విజయమ్మ, సిబ్బంది

అధిక దిగుబడులు సాధించడంపై శ్రద్ధ అవసరం

మార్టూరు, న్యూస్‌టుడే: అన్నదాతలు రబీ సాగులో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ కోరారు. రబీ పంటల యాజమాన్యంపై శుక్రవారం మార్టూరులో సాంకేతిక అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి పర్చూరు, మార్టూరు, అద్దంకి సబ్‌డివిజన్ పరిధిలో పది మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి మాట్లాడుతూ రబీలో ప్రధాని ఫసల్ బీమా యోజన కింద వర్తించే పంటలు, వాటి ప్రీమియం వివరించారు. ఏరువాక బాపట్ల కో-ఆర్డినేటర్ డాక్టర్ బాల మురళీధర్ నాయక్ మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. శనగ, వరి సాగులో కనిపించే తెగుళ్ల నివారణపై శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి వివరించారు. ఏడీఏలు కె.వి.శ్రీనివాసరావు, ఎన్.మోహన్‌రావు, ధనరాజ్, ఏవోలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ

Before of the Hon'ble Deputy Registrar of Chits: Bapatla
ARC No. 32/2022

Between:
M/s Margadarsi Chit Fund Pvt. Ltd. Chirala ...Disputant
Rep by its Branch Manager
and
Pynam Rambabu & Thers ...Opponents

Opponent No-1 Pynam Rambabu, S/o. P.Parameswara Rao, A/A 39 Years, Prop. M/s Swathi Mess, Indira Gandhi Municipal Complex, Shop No. 6, Bapatla Post & Mandal, Bapatla District, R/o. near Mahalakshmi Tree, Srungarapuram, Bapatla Post & Mandal, Bapatla District.

Opponent No-2 Patan Nagur Khan, S/o. P.Abdul Rahaman, A/A 44 Years, Prop. M/s. Nagoor Traders, Industrial Estate, RTC Depot, Bapatla Post & Mandal, Bapatla District, R/o. D.No. 11-3-9, Railway Station Road, Opp. Vijaya Krishna Theatre, Bapatla Post & Mandal, Bapatla District.

Opponent No-5 Pynam Sumanjali, W/o. P.Rambabu, A/A 38 Years, Prop. Manikanta Traders, Industrial Estate, Bapatla Post & Mandal, Bapatla District, R/o. Near Mahalakshmi Tree, Srungarapuram, Bapatla Post & Mandal, Bapatla District.

పై నెంబర్ దావలో Disputant కంపెనీ వారికి రావాలిసిన బాకీ రు.1,53,469/- కొరకు Dispute దాకలు చేసి వున్నారు. సదరు దావలో 1, 2 & 5వ Opponents అయిన మీరు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 26-10-2024వ తేదీన వాయిదా అయి వున్నది. పై దావాలో మీకు ఆక్షేపణలు వున్న యెడల ఆ రోజున అనగా ది: 26-10-2024వ మధ్యాహ్నం: 2.00 నిమిషములకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్, బాపట్ల వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు విచారించి తీర్మానించబడును.

The Deputy Registrar of Chits
District Registrar Office, Bapatla

భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

బాపట్ల, న్యూస్‌టుడే: భూ సమస్యలపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని జేసీ ప్రఖర్‌జైన్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో జిల్లా స్థాయి రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే వారి ఇబ్బందులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఒకే ప్రాంతం నుంచి పలుమార్లు అర్జీలు వస్తుంటే కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్ కావాలని సిఫార్సులు చేస్తే సీసీఎల్ఏకు సరెండర్ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాల్లో సమస్యలపై వచ్చిన 142 అర్జీలను పరిష్కరించాలని సూచించారు. చౌకధరల దుకాణాల్లో ఖాళీలను షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. జిల్లాలో 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల కోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం సమర్థంగా నిర్వహించాలన్నారు. నీటి తీరువా చెల్లిస్తున్న, పంట కాల్వలపై ఆధారపడి సాగు చేస్తున్న రైతుల పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. బాపట్ల జిల్లాకు చెందిన మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శాసనమండలి పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయాలన్నారు. నవంబరు 6లోగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారుల కోసం భూములు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం నిర్మాణానికి, పరిశ్రమల స్థాపనకు భూసేకరణ చేయాలని చెప్పారు. నీటి సంఘాల పరిధిలో పీవోటీ చట్ట ఉల్లంఘన కింద 613.07 ఎకరాల భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయని గుర్తించామన్నారు. 50 ఏళ్లు నిండిన ఎస్టీలకు పింఛను పొందే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

ఆఖరి నిమిషం.. ప్రాణాలు తోడేసింది!

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని దుర్మరణం

వినుకొండ రూరల్, అద్దంకి, న్యూస్‌టుడే: సమయం మించిపోతోంది.. సకాలంలో పాఠశాలకు చేరాలనే ఆందోళన ఒకవైపు.. ముఖ చిత్ర హాజరు(ఎఫ్.ఆర్.ఎస్) ఆలస్యమైతే ఇబ్బందనే భయం మరోవైపు.. మదిలో ఇన్ని ఆలోచనలు కదులుతుండగా, ఆఖరి నిమిషంలో హడావుడిగా సాగిన ప్రయాణం ఓ ఉపాధ్యాయురాలి ప్రాణం తోడేసింది. గమ్యం చేరేలోపు ఆర్టీసీ బస్సు ఎదురుగా రావడంతో ఆమె ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లడంతో జారి కింద పడ్డారు. ఘటనలో తీవ్ర గాయాలవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం.. బాపట్ల జిలా కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన కొత్తమాసు నాగేశ్వరరావు, మునగాల ధనలక్ష్మి(41) దంపతులు అద్దంకి పట్టణంలో నివసిస్తున్నారు. నాగేశ్వరరావు వ్యాపారి కాగా, ధనలక్ష్మి పల్నాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ధనలక్ష్మి రోజూ అద్దంకి నుంచి ఆర్టీసీ బస్సులో పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో నాగులవరంలో తెలిసిన వారి ఇంటి వద్ద స్కూటీ ఉంచుకుని అక్కడి నుంచి రెండు కి.మీ దూరంలో ఉన్న గోకనకొండ పాఠశాలకు వెళ్లి విధులు నిర్వహించి వస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం అద్దంకి నుంచి వినుకొండ వెళ్లే బస్సు అందకపోవడంతో, మరో బస్సు ఎక్కి బల్లికురవ మండలం కొప్పెరపాడులో దిగారు. అదే సమయంలో ఆ మార్గంలో బైకుపై వెళ్తున్న మరో ఉపాధ్యాయుడిని లిఫ్ట్ అడిగారు. ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మరికొద్ది నిమిషాల్లో గమ్యానికి చేరుకునే వేళ నాగులవరం సమీపంలో ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చింది. రోడ్డుతో పాటు మార్జిన్లు గుంతలమయంగా ఉన్న మార్గంలో ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కకు పోనిచ్చి తిరిగి పైకి ఎక్కించే క్రమంలో వాహనం కుదుపునకు ధనలక్ష్మి చేతిసంచి జారడంతో దాన్ని పట్టుకునే ప్రయత్నంలో ఆమె జారిపడ్డారు. ఘటనలో తల తారురోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం తెలిసి వారు వచ్చారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ధనలక్ష్మి మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం అద్దంకి ఎస్‌బీఐ రోడ్డులోని స్వగృహానికి తరలించగా పలువురు నివాళి అర్పించారు. నెల క్రితమే నాగేశ్వరరావు తండ్రి కోటేశ్వరరావు వయోభారంతో మృతి చెందారు. అంతలోనే భార్య కూడా ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.


ధనలక్ష్మి (పాత చిత్రం)


ప్రమాదం జరిగిన గుంత

ఖాజీపాలెం అధ్యాపకుడికి అబ్దుల్ కలాం అవార్డు

ఖాజీపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ఖాజీపాలెం కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు వి.నారాయణరెడ్డిని సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌పీఎల్‌టీఓ) గుంటూరు వారు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారు. బోధనా నైపుణ్యం, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా, ఎన్‌సీసీ కేర్ టేకర్‌గా కళాశాల విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, సైనిక విభాగానికి సంబంధించిన ప్రాథమిక శిక్షణ అందించడం తదితర కార్యక్రమాలకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. అవార్డుకు ఎంపికైన నారాయణరెడ్డిని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, ఉపాధ్యక్షుడు శివరామరాజు, కార్యదర్శి శ్రీనివాసకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ తలశిల శివప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


నారాయణరెడ్డి

నేడు దిశ కమిటీ సమావేశం

బాపట్ల, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో అమలవుతున్న పథకాల తీరుపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షక కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్లో శనివారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ తొలుత కలెక్టరేట్ ఆవరణలో ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఎంపీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు సూరేపల్లి విద్యార్థిని

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు సూరేపల్లి వీపీఅండ్‌జీఎస్ఎం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బొర్రా గీతికాశ్రీ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసశర్మ తెలిపారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందని చెప్పారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు జి.వి.ఎస్.నాగేశ్వరరావును పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకటకృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.


గీతికాశ్రీ


సయ్యద్ షబీనా

జిల్లా జట్టుకు భట్టిప్రోలు బాలిక.. జిల్లా స్థాయి వాలీబాల్ జట్టుకు స్థానిక టీఎంరావు ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని సయ్యద్ షబీనా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు. ఎంపికైన విద్యార్థిని, వ్యాయామ ఉపాధ్యాయులు చేబ్రోలు శ్రీనివాసరావు, ఎం.డి.అనిల్‌హక్‌ను కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, రిటైల్ ధర - 152, చికెన్ విత్‌స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, 144, 155 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మద్యం విధానం లోపభూయిష్టం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి విమర్శ

కొల్లూరు, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన మద్యం విధానం లోపభూయిష్టంగా ఉందని, దీంతో విచ్చలవిడిగా వెలుస్తున్న మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా మహిళలు పలు చోట్ల ఆందోళనలు చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. వరద ముంపునకు గురైన లంక గ్రామాల్లో తమ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం పర్యటించిన ఆయన స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిళలు తిరస్కరించిన ప్రాంతంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లాటరీ పద్ధతిలో మద్యం దుకాణ హక్కులు పొందిన వ్యాపారులు బెల్టు షాపులు నిర్వహించేందుకు ముందుకొచ్చిన వారి నుంచి రూ. 5లక్షలు నుంచి రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారన్నారు. బెల్టు షాపులను నిషేధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇదిలా ఉంటే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో నెలలు గడుస్తున్నా ఇసుక లభ్యతే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆరోపించారు. మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మాణం చేసి లంక గ్రామాలు, పొలాల్లో వరద నీటి మళ్లింపునకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కార్యదర్శి ధూళిపాళ్ల రమాదేవి మాట్లాడుతూ వరద ముంపు ప్రాంతాల్లో డ్వాక్రా రుణాల చెల్లింపులు ఆరు నెలల పాటు రద్దు చేసి సున్నా వడ్డీకి రుణాలివ్వాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ ఎంతో మంది కౌలు రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, తురుమిళ్ల కృష్ణమోహన్, బొనిగల సుబ్బారావు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

వైదన(అద్దంకి), న్యూస్‌టుడే: అప్పులబాధ తాళలేక యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. చికిత్స పొందుతూ ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం మృతిచెందాడు. బల్లికురవ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ బి.శ్రీనివాసరావు అందించిన సమాచారం మేరకు.. బల్లికురవ మండలం వైదన గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు(35) ఆటో నడుపుకొంటూ జీవిస్తున్నాడు. అప్పులబాధతో వారం రోజుల నుంచి మద్యం తాగుతున్నాడు. శుక్రవారం ఉదయం తన ఇంటి వద్దనే మద్యంతో పాటు గడ్డిమందును కలిపి తాగేశాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆయన్ను అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య రామాంజమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వు నేను	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజ్ స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ ది స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008538017

కాలువలో పడి కౌలురైతు మృతి

కర్లపాలెం, న్యూస్‌టుడే: కాలువలో పడి కౌలురైతు మృతి చెందిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెదగొల్లపాలెం పంచాయతీ మార్పుచెన్నాయవారిపాలేనికి చెందిన కాగిత దావీదు (68) పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవాడు. ఈనెల 17న మర్రికట్టవ సమీపంలో పొలం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న మురుగు కాలువలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు శుక్రవారం కాలువ దగ్గరకు వెళ్లి వెతకగా మృతదేహం లభించింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS
AP ప్రభుత్వం ఆమోదం పొందిన ఇసుక లారీ / ట్రాక్టర్లకు GPS అమ్మేందుకు డీలర్లు కావలెను. కంపెనీ వారి సంప్రదింపు నంబరు: Volty IoT Solutions 8367307070 9666841234

FINANCIAL SERVICES
బాకీ స్థలాలపై లోన్స్ / హోమ్ లోన్స్ / ప్రోపర్టీ లోన్స్ / బిజినెస్ లోన్స్ / పర్సనల్ లోన్స్ చేయబడును. సిబిల్ అవసరం లేదు. సంప్ర: ✆ 73968 33074.
పర్సనల్, వ్యాపారం ... ✆ 90632 90864.

REAL ESTATE
GENERAL
AP రాజధానిలో ... Ph: 96035 30555.

FLAT FOR SALE
GUJJANAGUNDLA
3BHK 1515 Sft. & 2BHK 1140 Sft. ... ✆ 9848134628, 9246646625.
INNER RING ROAD
... ✆ 9848110543, 8885566086.
PATTABHIPURAM
... ✆ 95022 24442.
GENERAL
... Ph: 99596 17002.

LAND FOR SALE
GENERAL
10 సెంట్లు ... Ph.: 9505885993, 9393107955.

PLOT FOR SALE
GENERAL
విజయవాడ to హైదరాబాద్ ... Ph: 93477 56501.

TO LET
6/12 Cross Road Cross Road, Opp Municipal Park, 3 Bed Pent House Toilet Family Only Brahmins. Ph: 9972291771.
నంబూరు నాగార్జున ... Rain Tree Park ... Single Room with Attached ... Boards ... Ph: 9394712055.

COMMERCIAL
గుంటూరు సిటీలోని ... ✆ + 91 99895 92958.

JOBS
Wanted: Medical Representatives with field experience. Contact: 92905 59055, 72072 13131.
Wanted Freshers/ 1 Year Experience Technical Sales Executives, B.Sc Computers/ Diploma. WhatsApp: +91 9701132415. sales@netlogon.us Walk-in on 22-10-2024.

Wanted Experienced Faculties to Teach MS Office, C Language, Java, Python, Tally, SAP, Auto CAD, 3DS Max, Revit, Catia, Spoken English. Ph: 99859 43539.
... Age: 21-40 ... ✆ 81215 02699, 70755 69996.
... ✆ 98483 84367.
... ✆ 99120 11499, 99120 11899.
... Ph: No: 97051 86006.
... ✆ 94912 23519.
... Ph: 97046 67268.
... 90140 90249, 90140 84525.
... ✆ 7207779699.

విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త! అదనపు ఆదాయం కొరకు గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థతో కలిసి పనిచేయుటకు 50 సం॥ పైబడి, 10th పాస్ అయినవారు కావలెను. ✆: 95051 77327.
మా సంస్థ గుంటూరు నందు ... Male కావలెను. అర్హత: Any Degree ✆ 91779 44155.
... ✆ 96769 19111.
... ✆ 77801 85014.
... Womens Residential Hostel ... Ph: 85209 99560.

గమనిక ...

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జీ.ఎస్.టీ. అదనం

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589, 91549 76437

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

ముంపు మాగాణుల్లో సస్యరక్షణ ఇలా..

కొల్లూరు, న్యూస్‌టుడే: మండలంలో కురుస్తున్న అధిక వర్షాలకు చినపులివర్రు, దోనేపూడి, క్రాప, రావిరేవుపాడు పరిధిలో ముంపునకు గురైన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. పిలకలు వేసే దశలో ఉన్న వరి పంట నాలుగైదు రోజులపాటు నీట మునిగినా రైతులు ఆందోళన పడాల్సిన పని లేదని సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా పంటను కాపాడుకోవచ్చన్నారు. పొలంలో నిలిచిన నీటిని చిన్న కాలవల ద్వారా బయటకు పంపి, ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలని సూచించారు. అధిక తేమ వల్ల పంటకు తలెత్తే సమస్యలు యూరియా వేసుకోవడం ద్వారా పరిష్కారం అవుతాయని, పొటాష్ వల్ల తెగుళ్లు, పురుగులను తట్టుకునే శక్తి పంటకు అందడంతో పాటు త్వరగా కోలుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ నెల 15లోగా ఆర్బీకేల్లో పంట నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు.

21న పొన్నూరులో అష్టావధానం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా పొన్నూరు శంకర మఠంలో ఈనెల 21న బ్రాహ్మణ మహాసభ అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించనుందని సాహితీప్రియులు, తెలుగు భాషాభిమానులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఏపీ బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య జిల్లా నాయకులు రావూరి ఆంజనేయులు, పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. ఏవధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం నిర్వహించే అష్టావధాన ప్రక్రియకు సంచాలకుడిగా డివి శ్రీనివాసాచార్యులు వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పులిపాక వెంకట సత్యసాయి వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? మండలంలో కొంతకాలం క్రితం సంభవించిన వరదల వల్ల కిష్కిందపాలెంలోని రక్షిత మంచినీటి పథకం నీళ్ల ట్యాంకు లోకి మురుగు నీరు చేరింది. ట్యాంకు చుట్టూ పక్కన చెత్త పేరుకుపోయింది. పక్కనే ఉన్న గుంతలోని నీటిలో నాచు దుర్గంధం వెదజల్లుతోంది. దీని వల్ల దోమలు వ్యాప్తి చెందడంతో పాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. - కుటుంబరావు, కిష్కింధపాలెం

✔ వెంటనే సిబ్బందిని పంపి చెత్తను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం. - సునీత, ఈవోపీఆర్‌డీ, కొల్లూరు

- న్యూస్‌టుడే, కొల్లూరు

? జంపని రెండోవార్డులో ఓ వీధి పక్కన విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేశారు. అయితే ఫ్యూజ్ బాక్సును తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో ఆ రోడ్డున నడిచేవారికి ప్రమాదం పొంచి ఉంది. - స్థానికుడు, జంపని

✔ వెంటనే విద్యుత్తు సహాయకుడితో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. - గోపి, ఏఈ విద్యుత్తు ఉపకేంద్రం, వేమూరు

- న్యూస్‌టుడే, వేమూరు

? మండలంలో మోదుకూరు నుంచి మామిళ్లపల్లి మీదుగా పొన్నూరు వెళ్లే మార్గంలో తుంగభద్ర వంతెనపై రహదారి అంచులో మట్టి పేరుకుపోయి వర్షాలకు బురదగా మారింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు పోవాలంటే పక్కకు వెళితే ద్విచక్రవాహనచోదకులు జారిపడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. - స్థానికులు

✔ వంతెన వద్ద పేరుకుపోయిన మట్టి తొలగింపునకు చర్యలు చేపడతాం. - సైమన్‌పాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

- న్యూస్‌టుడే, చుండూరు

? మండలంలోని పిట్టువానిపాలెం పడమర వీధిలో సీసీ రహదారి గుంతలతో నిండి మట్టి, ఇసుక పేరుకుపోయాయి. వర్షపు నీరు గుంతలో నిల్వ ఉండటంతో నివాసితులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి. - వెంకటలక్ష్మి, పిట్టువానిపాలెం

✔ సీసీ రహదారిపై గుంతల్లో నీరు నిలవున్న మాట వాస్తవమే. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - వసుంధరలక్ష్మి, కార్యదర్శి, పిట్టువానిపాలెం

- న్యూస్‌టుడే, పిట్టలవానిపాలెం

చెరుకుపల్లి.. దప్పిక తీరే దారేది?


ఎక్కడ చూసినా నీటమునిగిన కుళాయిలు

మురుగు చేరిన రక్షిత మంచినీటి పథకం

క్లోరినేషన్ లేని సరఫరాతో అనారోగ్యం

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

మండల కేంద్రం చెరుకుపల్లిలో ఎక్కడ చూసినా వర్షపునీరే కనిపిస్తోంది. ఒక్కొ జాతీయ రహదారి మినహా గ్రామంలో ఏ అంతర్గత రహదారి చూసినా వర్షపు నీరు, మురుగు నీటితో నిండిపోయి. దీంతో కొన్నిచోట్ల తాగునీటి కుళాయిల చుట్టూ మురుగు తిష్టవేసింది. దీని ఇక్కడ నీరు పట్టుకోవడానికి మహిళలు మురుగు నీటిలోకి దిగాల్సి వస్తోంది. రోజుల తరబడి నిలిచి ఉండే ఈ నీటిలో దిగిన వారికి చర్మ సంబంధిత వ్యాధులు రావడంతో వారు ఈ కుళాయి నీటిని పట్టుకోవడం మానేశారు. గ్రామానికి నీరందించే 1.20లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరడంతో గ్రామ ప్రజలకు అధికారులు డైరెక్టు పంపింగ్ ద్వారా భూమి నుంచి నీటిని తోడి కుళాయిల ద్వారా అందిస్తున్నారు. వర్షాలు, వరదల కారణంగా భూగర్భ జలాలు మారాయి. దీంతో అతిసారం, ఇతర అనారోగ్య సమస్యలు ప్రబలే అవకాశం ఉంది. దీంతో గ్రామస్థులు కుళాయి నీటికి బదులు ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్ల నుంచి శుద్ధ జలం కొనుగోలు చేసి దప్పిక తీర్చుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇంకా ఎన్నాళ్లని అధికారులను వారు ప్రశ్నిస్తున్నారు.



శిథిలమైన రక్షిత మంచినీటి పథకం



ఎస్సీ కాలనీలో నీటి కుళాయి చుట్టూ మురుగు

చెరుకుపల్లి గ్రామ జనాభా దాదాపు 11 వేలు
రక్షిత మంచినీటి పథకం సామర్థ్యం 1.20లక్షలు లీటర్లు (శిథిలమైంది)
డైరెక్టు పంపింగ్ స్కీంలు 04
చెరుకుపల్లిలో నివసిస్తున్న కుటుంబాలు (అద్దెకు ఉండే వారితో సహా) 2150 కుటుంబాలు
కుళాయి నీరు అందుకునే వారు దాదాపు 850 కుటుంబాలు
ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్ నుంచి శుద్ధ జలం తెచ్చుకునే వారు 1300 కుటుంబాలు
ఒక కుటుంబానికి రోజుకు 20లీటర్ల క్యాన్ రూ.10 చొప్పున ఒక రోజు ఖర్చు రూ.13 ఖర్చు
చెరుకుపల్లిలో శుద్ధ జలం ఒక నెల ఖర్చు సుమారు రూ.3.90 లక్షలు

భూగర్భ జలం కలుషితమైతే?

రక్షిత మంచినీటి పథకం ఉన్న చోట తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలి. తద్వారా నీటి నుంచి వచ్చే చెడు బ్యాక్టీరియా, ఇతర వైరస్‌లను నిర్మూలించి ప్రజలకు హాని కలిగించని, ఆరోగ్యకరమైన నీటిని అందించడానికి వీలుంటుంది. నేరుగా నీటిని సరఫరా చేసే సమయంలో ఆ నీటిని తోడే ప్రాంతంలో భూగర్భ జలాలు కలుషితం అయితే క్లోరినేషన్ చేయని కారణంగా బ్యాక్టీరియా, ఇతర హానికర క్రిములు నీటి ద్వారా శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలను కలిగిస్తాయి. దీంతో ప్రజా రోగాలు పడకే స్పందం. ప్రస్తుతం చెరుకుపల్లికి నీటిని తోడిపోస్తున్న మోటార్లు ఉన్న రామయ్య చెరువుకు ఒక పక్క ఉన్న తుమ్మలతోటలో నెలల తరబడి వర్షపు నీరు నిలిచి రంగుమారింది. ఇది భూమిలోకి ఇంకితే చెరువు నీటితో చేరి కలుషితమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెట్లు పెరిగి నిరుపయోగంగా మారిన ఫిల్టర్ బెడ్

చర్యలు తీసుకుంటాం

గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేవు. డైరెక్టు పంపింగ్ స్కీం కింద గ్రామంలో నాలుగు ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నాం. ఉన్న మంచినీటి రక్షిత పథకానికి మరమ్మతులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ వర్షాలు తగ్గగానే పనులు చేపడతాం. ఆ వెంటనే క్లోరినేషన్ చేసిన నీటిని అందిస్తాం. ప్రస్తుతానికి సమస్యలు లేవు. - ఈవూరి విజయబాబు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి

తెలుగు సాహిత్యం విశిష్టత చాటిన విశ్వనాథ

బాపట్ల, న్యూస్‌టుడే: విశ్వనాథ సత్యనారాయణ తన రచనల ద్వారా తెలుగు సాహిత్యం విశిష్టతను అందరికీ చాటి చెప్పారని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సాహితీభారతి ఆధ్వర్యంలో కవి విశ్వనాథ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కవులు, రచయితలు పూలమాల వేసి నివాళి అర్పించారు. రచయితలు మాల్యాద్రిరావు, ఆదం షఫీ, శ్రీనివాసరావు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

నగరం: స్థానిక శ్రీ వెంగాపుడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన వచ్చింది. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీ వెంగాపుడి కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు తీర గ్రామాల నుంచి 173 మంది నిరుద్యోగులు హాజరు కాగా టాటా కాపిటల్, అరబిందో ఫార్మా, ఏయూ ఫైనాన్స్ మాస్టర్ మైండ్స్ కంపెనీల ప్రతినిధులు 77 మందికి ఉద్యోగ అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయ అధికారి సోగంటి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు లగడపాటి వేణుగోపాల్ అన్నారు. బాపట్లలోని బీసీ సంఘాల కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఓటు వేసి ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తానన్నారు. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానన్నారు.

వరద బాధితులకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలి

భట్టిప్రోలు, కొల్లూరు, న్యూస్‌టుడే: లంక గ్రామాల్లో వరద బాధితులకు విజయవాడ తరహాలోనే రూ.25 వేలు నష్ట పరిహారం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కొల్లూరు మండలం తిప్పలకట్ట, భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామాల్లో 800 మంది వరద బాధిత కుటుంబాలకు సీపీఎం ఆధ్వర్యంలో రూ.2.40 లక్షల విలువ చేసే దుప్పట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం లంక గ్రామాల ప్రజలను పూర్తిస్థాయిలో ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. డ్వాక్రా గ్రూపుల రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ రానంత వరద రావడంతో రైతులు పంటలతో పాటు ఇళ్లు, సామగ్రి కోల్పోయి భారీగా నష్టపోయారని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వరద బాధితులను సీపీఎం ఆదుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక, మద్యం పాలసీ గత ప్రభుత్వ విధానాలను తలపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, వేములపల్లి వెంకట్రామయ్య, బి.ఎల్.కె.ప్రసాద్, పద్మల మనోజ్, నాగరాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు: దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు శ్రీనివాసరావు, రమాదేవి

మునగాకు సర్వరోగ నివారిణి

రేపల్లె అర్బన్, నగరం, అమృతలూరు, న్యూస్‌టుడే: గర్భవతులు, బాలింతలు మునగాకును ఆహారంలో తీసుకుంటే హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని రేపల్లె సీడీపీవో సుచిత్ర అన్నారు. రేపల్లె ఒకటోవార్డు, నగరం మండల పరిధిలోని చిన మట్లపూడిలో మునగాకు పండుగ నిర్వహించారు. మునగాకులో ఎ, సి విటమిన్లు ఉంటాయని, రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంచుతుందని, సర్వరోగ నివారిణి అన్నారు. మునగాకుతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమృతలూరులో ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అమృతవాణి మునగాకు నుంచి లభించే పోషకాలపై చిన్నారుల తల్లులు, బాలింతలు, గర్భవతులకు అవగాహన కల్పించారు.



రేపల్లె: మునగాకుతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శన

మురుగు నీటి తరలింపునకు చర్యలు

నిజాంపట్నం, న్యూస్‌టుడే : వాయుగుండం కారణంగా తీరంలో అధిక వర్షాలు పడి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల కేంద్రం నిజాంపట్నంలో పలు కాలనీల్లో నీరు నిలిచింది. దీనిపై పంచాయతీ అధికారులు, పాలక వర్గం స్పందించారు. మురుగు నీటి తరలింపు చర్యలు చేపట్టారు. పొక్లెయినర్ ఏర్పాటు చేయించి నిల్వ నీరు బయటకు పోయేలా చర్యలు చేపట్టారు.

ఇంకా నీటిలోనే పొలాలు



నిజాంపట్నం, న్యూస్‌టుడే : నిజాంపట్నం పంచాయతీలో ఎక్స్‌మిలటరీ కాలనీ- గోకర్ణమఠం గ్రామాల సమీపంలో సాగు చేసిన వరి పొలాలను మురుగునీరు వీడడం లేదు. గతంలో వర్షాలకు చేరిన నీరు తగ్గుదని భావిస్తున్న తరుణంలో వాయుగుండం కారణంగా కురిసిన వానలకు మళ్లీ ముంపు సమస్య తప్పలేదని కర్షకులు కలత చెందుతున్నారు. గత వైకాపా పాలనలో నిజాంపట్నం నుంచి కొమరవోలు వరకు ఉన్న మురుగు కాల్వ పూడిక తీసి ఉంటే ఇబ్బందులు సమస్య ఉండేది కాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మళ్లీ వానలు పడితే వరి పంట కాపాడుకోవడం కష్టమే అంటున్నారు. రానున్న వేసవిలో మురుగు కాల్వల పూడికతీత చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డుకు కోతలు..చిన్నారులకు వెతలు

నగరం, న్యూస్‌టుడే: ఛిద్రమైన అంతర్గత రహదారులతో విద్యార్థులు, వాహన చోదకులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలో వెనిగళ్లవారిపాలెం గ్రామంలో అంతర్గత రహదారులు కోతకు గురికావడంతో పాటు మట్టి రహదారులు వర్షాలకు బురదగా తయారయ్యాయి. రోడ్డు మూడోవంతు కోతకు గురవడంతో వాహన చోదకులు ముఖ్యంగా రాత్రిళ్లు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యార్థులు బురదలో నుంచే కాలినడకన పాఠశాలలకు రావాల్సి వస్తుందని, మండల స్థాయి అధికారులు చొరవ చూపి కోతకు గురైన రహదారులను మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అంతర్గత రహదారి ఇలా..

ఇలా అయితే జ్వరాలు రావా?

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలో బావపురి కాలనీ మూడో లైనులో డ్రైనేజీల్లో సక్రమంగా మురుగుపారుదల లేక దుర్వాసన వెదజల్లుతుంటో పాటు దోమలు వృద్ధి చెంది స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వల్లో ముళ్లమొక్కలు పెరిగాయి. వాటిని తొలగించి మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు చేపట్టాలని వార్డు వాసులు కోరుతున్నారు. ఈ విషయమై బాపట్ల మున్సిపాలిటీ శానిటరీ విభాగం ఏఈ ఉమామహేశ్వరరావును సంప్రదించగా రెండ్రోజుల్లో డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు ముళ్ల చెట్లను తొలగిస్తామన్నారు.



పాల ఉత్పత్తి పెంపే లక్ష్యం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : గ్రామాల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా పాల ఉత్పత్తిని పెంచడమే లక్ష్యమని హెరిటేజ్ ఫుడ్స్ కంపెనీ సీఈవో శ్రీదీప్ కేశవన్ అన్నారు. మండలంలోని రాచూరు పాలకేంద్రం వద్ద రైతులకు పాడి పరిశ్రమపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. తమ కంపెనీ ద్వారా పది రాష్ట్రాల్లో పది వేల గ్రామాలలో 20 లక్షల లీటర్ల పాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. పాలు పోసే రైతులకు ఉచితంగా రూ.5లక్షల ప్రమాద, పశువుకు బీమా కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం పాల క్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎస్.రామ్మోహన్, వి.దివాకర్, నాగ అప్పారావు, యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్.కె.ఖాదర్‌వలీ, సూపర్‌వైజరు జొన్నా నాగేశ్వరరావు, పాలకేంద్రం ప్రతినిధి డివి హరికుమార్ పాల్గొన్నారు.



పాలక్యాన్లు పంపిణీ చేస్తున్న సీఈవో, ప్రతినిధులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం ప్యాకెట్లతో ఉపాధ్యాయులు

చుండూరు, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు దాతల సాయం అభినందనీయమని పారశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. దుగ్గిరాలకు చెందిన జాగృత భారత్ ట్రస్టు, కమార్ వర్క్స్ అధినేతలు పసుపులేటి గణేష్, కొత్తా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చుండూరు మండల యడ్లపల్లిలో ఆరో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు 400మందికి, బోధన చేస్తున్న ఉపాధ్యాయులకు రూ.1.6లక్షల విలువ చేసే పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠశాల సిబ్బంది దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో అభివృద్ధి వెలుగులు నింపుతాం



భట్టిప్రోలు: భూమి పూజలో ఎంపీ, జడ్పీటీసీ సభ్యులు

రేపల్లె అర్బన్, పిట్టలవానిపాలెం, నడింపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: అమృతలూరు, భట్టిప్రోలు, వేమూరు, నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలనలో పల్లెల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు కృషి చేస్తామని తెదేపా నేతలు అన్నారు. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని మండలాల్లో పల్లెపండగ వారోత్సవాలు నిర్వహించారు. మండల కేంద్రం నగరం, పూడివాడ, ఉప్పలపల్లి, తాడివారిపాలెం గ్రామాల్లో సుమారు రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా నాయకుడు అనగాని శివప్రసాద్ శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు. చెరుకుపల్లి మండలం నడింపల్లిలో శ్రీఅంకాళ్లమ్మ అమ్మవారి ఆలయ మార్గంలో మట్టి రోడ్డు అభివృద్ధి పనులకు తెదేపా బాపట్ల పార్లమెంట్ తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గోగినేని పద్మ శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ.15లక్షలతో పనులు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు మల్లెల రామకృష్ణ, నేతలు ఎమ్మార్వో మూర్తి, ఈవో పీఆర్‌డీ కె.శ్రీనివాస్, పీఆర్‌ఏఈ సేవా నాయక్ పాల్గొన్నారు.



చెరుకుపల్లి: నడింపల్లిలో శంకుస్థాపనలో తెదేపా నేతలు

రేపల్లె మండలం తుమ్మల, పోటుమెరక, నల్లూరుపాలెం, ఉప్పూడి గ్రామాల్లో రూ.50 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. సర్పంచులు హనుమప్రసాద్, నాంచారమ్మ, తెదేపా నాయకులు రేపల్లె రామాంజనేయులు, మరియదాసు, ఈవోపీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు. పిట్టలవానిపాలెంలో తెదేపా నాయకుడు బొలిగాని నారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సర్పంచి దండుబోయిన సామ్రాజ్యం, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు. అమృతలూరు మండలం గోవాడలో రూ.30లక్షలతో పక్కా రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సర్పంచి మండవ విజయలక్ష్మి, ఎంపీడీవో శేషమాంబ, ఈవోపీఆర్డీ నరసింహారావు పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలంలోని ఓలేరులో రూ.25 లక్షలతో సిమెంటు రోడ్డుకు ఎంపీపీ దావూరి వెంకటలలితకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల విజయభాస్కరరావు శంకుస్థాపన చేశారు. చింతమోటులో రూ.20 లక్షలు, వెల్లటూరులో రూ.30 లక్షలతో రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పెదపులివర్రులో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచి నీలా ఉషారాణి భూమి పూజ చేశారు. నాయకులు నీలా రమేష్, సూతక్కి దినకర్‌బాబు, ఎంపీడీవో ఎస్.వి.రమణ, ఈవోపీఆర్డీ ఉషారాణి పాల్గొన్నారు. వేమూరు మండలం వరహాపురం, బలిజేపల్లిలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఈవోపీఆర్డీ శేఖర్, జాతీయ ఉపాధి హామీ సాంకేతిక సహాయకుడు జగన్ భూమిపూజ చేశారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల పంచాయతీలో సిమెంటు రహదారుల నిర్మాణానికి తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఓబోయిన వెంకటయాదవ్, నాయకులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు.



నగరం: సీసీ రోడ్డు పనులకు శివప్రసాద్ శంకుస్థాపన

విరలేశ్వరనగర్‌లో నేడు శంకుస్థాపన

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : పల్లె పండగ వారోత్సవాలలో భాగంగా స్థానిక విరలేశ్వరనగర్‌లో రూ.60 లక్షల నిధులతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం శంకుస్థాపన చేస్తారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. కార్యక్రమానికి తెదేపా, కూటమి నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

కునుకేయనీయని చినుకు

జలదిగ్బంధంలో చెరుకుపల్లి ఎస్సీ కాలనీ

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

వాయుగుండం ప్రభావంతో వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరుకుపల్లిలో పలు ప్రాంతాల్లో ఇళ్ల మధ్యకు నీరు చేరింది. రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో మూడు సీసీ రోడ్లపై భారీగా నీరు నిలిచింది. ఇళ్ల మధ్యా నీరు చేరడంతో బయట అడుగు పెట్టేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణం స్పందించి దిగువకు నీటిని మళ్లించేందుకు మూడోబజారులో సీసీ రహదారిని పగలకొట్టారు. రోడ్డుకు గండి పెట్టి నీటిని పంట పొలాల్లోకి వదిలారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నానికి కొంత మేర నీరు తొలగింది. కాగా మోటార్లు, రెండోబజారు, పక్కనే ఉన్న నాయీబ్రాహ్మణ కాలనీ, రామకృష్ణనగర్‌లో ఇళ్ల మధ్యా చేరిన నీటిని తొలగించడంలో ఆటంకాలు ఏర్పడ్డాయి. రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించేందుకు మోటార్లు ఏర్పాటు చేస్తామని అధికారులు అంటున్నారు. నివాస ప్రాంతాలన్నీ ఎత్తుగా నిర్మాణాలు చేయడం, మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో గతంలో నిర్మించిన సీసీ రహదారులు పల్లంగా మారాయి. అధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రామకృష్ణనగర్‌లో ఇంటి అరుగు వరకు చేరిన వర్షపునీరు



రహదారి పగలకొట్టి నీటి తరలింపునకు ఏర్పాటు

మోటార్లతో తోడుతున్నాం

గ్రామంలో ఎస్సీ కాలనీతో సహా ఇతర అన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిన చోట్ల పెద్ద మోటార్లు తెప్పించి నీటిని తోడేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఎస్సీ కాలనీలో రోడ్డుకు గండి పెట్టి అక్కడి మట్టుపక్కల నీటిని తొలగిస్తున్నాం. సంపత్‌బాబు కాలనీలో రోడ్డుపై నిలిచిన నీటిని మోటారుతో తొలగిస్తున్నాం. - ఈవూరి విజయబాబు, పంచాయతీ కార్యదర్శి, చెరుకుపల్లి

ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చీరాల, న్యూస్‌టుడే: ఉద్యోగుల ఆరోగ్యంపై రైల్వేశాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఒంగోలు రైల్వే వైద్యశాల అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రమణారావు పేర్కొన్నారు. చీరాల రైల్వేస్టేషన్ సమావేశంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సాధారణ పరీక్షలతో పాటు మందులు అందించారు. బాపట్ల మజ్దూర్ యూనియన్ కార్యదర్శి నరేష్, జూనియర్ ఇంజినీరు సురేష్ పర్యవేక్షించారు.

కులదూషణపై డీఎస్పీ విచారణ

భట్టిప్రోలు: మండలంలోని పెదలంక మధ్యగూడెం గ్రామానికి చెందిన వి.జగన్మోహనరావు, అతని బంధువులు కులం పేరుతో దూషించారని అదే గ్రామానికి చెందిన గొరిగపూడి ప్రసాద్ జిల్లెల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదైంది. ఈ విషయమై రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు గ్రామానికి వచ్చి శుక్రవారం విచారించారు. సాక్షుల వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. ఎస్సై శివయ్య, వీఆర్‌వో, పీఆర్‌ఏలు ఆయన వెంట ఉన్నారు.

CHANGE OF NAME
I, ARE NAVYA SREE (New Name) W/o. ACHANTA VIJAY, previously called as ACHANTA NAVYA SREE (Old Name), resident of Door No. D No. 5-2-36/1, A.R Nagar, 10th ward, G.B.C. Road, Bapatla Town, Bapatla District., A.P., Pin code - 522 101. Changed my name from ACHANTA NAVYA SREE (Old Name) to ARE NAVYA SREE (New Name). Henceforth I am being called as ARE NAVYA SREE (New Name) for further purpose.

(c) eenadu

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? ఇటీవల కురిసిన వర్షాలకు పావులూరు రోడ్డు నుంచి పాత వైద్యశాల వరకు నాగుల చెరువు కట్ట గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. గుంతలు పూడ్చి రాకపోకలు సవ్యంగా జరిగేలా చూడాలి.

రావి శ్రీనివాసరావు రైతు, ఇంకొల్లు

✔ వర్షాలు కురుస్తున్నందున రహదారికి గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు వెలిసిన వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం. -రామసుబ్బారెడ్డి పంచాయతీ కార్యదర్శి, ఇంకొల్లు. ఇంకొల్లు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

కడవకుదురు (చినగంజాం), న్యూస్‌టుడే: కడవకుదురు ఆర్అండ్‌బీ రోడ్డు పాత చెక్ పోస్టు కార్యాలయం ఎదుట మలుపు వద్ద వర్షపు నీరు నిలిచింది. వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. స్థానికులు సమస్యను పరిష్కరించుకుండానని 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి శుక్రవారం తెచ్చారు. దీనికి స్పందించిన గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు సాయంత్రం పంచాయతీ కార్మిక సిబ్బందితో రోడ్డుపై చేరిన వర్షపు నీటిని బయటకు పంపి, సమస్యను పరిష్కరించారు.

శుద్ధజలాలతో చక్కని ఆరోగ్యం



ప్లాంటును ప్రారంభిస్తున్న పురపాలక మేనేజరు శ్రీదేవి

నర్రావారిపాలెం(అద్దంకి), న్యూస్‌టుడే: శుద్ధజలాలు తాగడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని అద్దంకి పురపాలక మేనేజరు వి.శ్రీదేవి అన్నారు. దక్షిణ అద్దంకి నర్రావారిపాలెంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శుద్ధజల కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభోత్సవం చేశారు. తెదేపా నేతలు దొప్పలపూడి దుర్గాప్రసాద్, శివప్రసాద్, బిల్లపాటి రామాంజనేయులు, కుందారపు రామారావు, ప్లాంట్ నిర్వాహకులు శ్రీనివాసరావు, నర్రా సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

వేటపాలెం, న్యూస్‌టుడే: రామన్నపేటలోని 33/11 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అరుణ కుమారి తెలిపారు. దీనివల్ల వేటపాలెం, రామన్నపేట పంచాయతీల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ శరత్ చౌదరి

రోటరీ సేవలు విస్తృతం చేయాలి

వేటపాలెం, న్యూస్‌టుడే: రోటరీ సేవలు మరింత విస్తృతం చేయాల్సిన బాధ్యత సభ్యులపై ఉందని రోటరీ 3150 గవర్నర్ కె.శరత్ చౌదరి అన్నారు. స్థానిక క్లబ్‌ను గవర్నర్ హోదాలో ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్ అధ్యక్షత వహించారు. ఇప్పటి వరకు క్లబ్ ద్వారా చేసిన సేవలు వివరించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నరు టి.రమేష్ చంద్ర, కార్యదర్శి ఊటుకూరి లక్ష్మణస్వామి, వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం, మాజీ అధ్యక్షుడు కొత్త వాసు, బట్ట మోహనరావు, ప్రత్తి వెంకటసుబ్బారావు, పొగడదండ రవికుమార్, పింజల ప్రసాదరావు, పద్మనాభుని శ్రీనివాసరావు, రొండా దశరథరామిరెడ్డి, వూట్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

దోమల మోత.. జ్వరాల వాత

అల్లాడుతున్న దండుబాట వాసులు

చీరాల, న్యూస్‌టుడే

ఇటీవల కురిసిన వర్షాలకు దండుబాట పరిసరాల్లో ఎక్కడికక్కడ ఇళ్ల మధ్య నీరు నిలిచింది. దీంతో ఒకవైపు దోమలు, మరోవైపు నిల్వ నీటి ప్రభావంతో వస్తున్న డెంగీ, మలేరియా వంటి జ్వరాలతో ఈ ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వైకుంఠపురం జాలమ్మ గుడి ప్రాంతంలోని యానాది కాలనీ చుట్టూ వర్షపు నీరు చేరింది. వర్షాలు తగ్గినా ఎక్కడి నీరు అక్కడే ఉంది. దీంతో పాచి, దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు, వర్షపు నీరు కలసిపోవటంతో పాటు చెత్తా చెదారంతో దారుణంగా ఉంది.. ఇక్కడ పరిస్థితి. శ్రీరామ్‌నగర్ పల్లపు ప్రాంతం కావటంతో ఇక్కడ ఇళ్ల చుట్టూ నీరు చేరింది. బలహీన వర్గాల కాలనీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. జవహర్‌నగర, విజిలీ పేట, రోశయ్య కాలనీ, పాలేటి నగర్‌లలో ఖాళీ స్థలాలు వదిలేయటంతో వాటి మధ్య చిల్లచెట్లు మొలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



శ్రీరామ్‌నగర్‌లో ఇళ్ల ముందు పరిస్థితి

రాత్రయితే చాలు.. : ఇళ్ల చుట్టూ నీరు చేరటంతో దోమలు అల్లాడిస్తున్నాయి. రాత్రయితే చాలు ఒక్కటే మోత, వీటి ప్రభావంతో ఈ ప్రాంతాలన్నీ కొద్దిరోజులుగా జ్వరాల బారిన పడుతున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సంపాదనలో అధిక మొత్తం జ్వరాలకే ఖర్చు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని మురికివాడలు ఈప్రాంతంలోనే అధికం. ఇక్కడ ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టాల్సిన అధికారులు మొక్కుబడి కార్యక్రమాలకే పరిమితమయ్యారు. జ్వరాలు ప్రబలిన చోట మాత్రమే నామమాత్రంగా ఫాగింగ్ నిర్వహిస్తూ బ్లీచింగ్ చల్లుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదాయమంతా వైద్యానికే



వరుసగా ఇంట్లో అందరికీ జ్వరాలు రావటంతో ఆదాయమంతా వైద్య ఖర్చులకే సరిపోయింది. దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా ప్రాంతాల్లో ఫాగింగ్ చేయలేదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి.
– చిన్నమ్మాయి

పాచి వాసనతో ఇబ్బంది



నీరు నిలిచిపోవటంతో వాసన వస్తుంది. ఇళ్లలోకి వెళ్లాలన్నా ఆ పాచి నీటిలో నుంచే వెళ్లాలి. దీంతో అనేక వ్యాధులు వస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలి. – సాంబయ్య

32 మందికి ఉపాధి

అద్దంకి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 32 మంది వివిధ కంపెనీల్లో పని చేసేందుకు ఎంపికయ్యారు. మొత్తం 67 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రముఖ కంపెనీలైన జోయాలుక్కాస్, టాటా క్యాపిటల్, హెటెరో డ్రగ్స్, అరబిందో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధానాచార్యులు ఎంవీ.రత్తయ్య, కరస్పాండెంట్ ఎంఎ.రత్తయ్య, బాపట్ల జిల్లా ఉద్యోగ కల్పనాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అసలేం జరిగింది?

శ్రీనివాసరావు మృతిపై అనేక అనుమానాలు



శ్రీనివాసరావు (పాత చిత్రం)

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: వారం రోజుల క్రితం వాడరేవు-శ్రీవారిపాలెం రోడ్డులో నిర్మాణంలో ఉన్న కల్వర్టులో పడి పాపాయిపాలేనికి చెందిన పులి శ్రీనివాసరావు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇది రోడ్డు ప్రమాదమని పోలీసులు పేర్కొంటుండగా హత్య అనే అనుమానాలను కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో అసలు శ్రీనివాసరావు ఆరోజు రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఇంటి వద్ద ఉండగా ఫోను రావడంతో హడావిడిగా తన ద్విచక్ర వాహనంపై బయలుదేరి వెళ్లారు. ఆతరువాత రాత్రి 10 గంటల 13 నిమిషాలకు అతని వద్ద పని చేసే బి.కిషోర్ ఫోను చేసి మాట్లాడారు. రాత్రి పదిన్నర తరువాత చరవాణి స్విచ్ ఆఫ్ అయిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆసమయంలో ఏం జరిగి ఉంటుందనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మరుసటి రోజు శ్రీనివాసరావు కోసం బంధువులు, స్నేహితులు వెతుకుతుండగా రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతంలోని నీటికుంటలో బండిని గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని ద్విచక్ర వాహనం కింద ఉన్న శ్రీనివాసరావు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రాథమికంగా ఆప్రాంతంలో ఆధారాల కోసం పోలీసులు జల్లెడ పడతారు. కానీ ఇక్కడ అలా జరగలేదు. ఇలా ఎందుకు చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విషయం తెలుసుకున్న వెంటనే మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాపాయిపాలేనికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించి, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.

భూముల కొనుగోలు

శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తుంటారు. ఈప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారం విస్తరించడంతో భూములు కొనుగోలు అమ్మకాలు చేస్తుంటారు. ఆతనికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు కుమార్తెలకు వివాహం జరిపించారు. అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడు. ఆతడు ప్రమాదానికి గురైన ప్రాంతంలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి రాత్రి ఆయినా కల్వర్టులో ప్రమాదవశాత్తు పడి ఉంటాడా. ఒక వేళ ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోతే చరవాణి జేబులో కానీ, ద్విచక్రవాహనం కుదురులో కానీ ఉండాల్సి ఉండగా అది నేటికి కనపడలేదు. దీనికి తోడు అప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా కిందకు ఉండటం, చెప్పులు కనిపించకపోవడం లాంటివి ప్రమాదంపై అనేక సందేహాలను కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు లేవనెత్తుతున్నారు. దీనికితోడు పదిరోజుల క్రితం వేటపాలెం మండలం బచ్చులవారిపాలెం సమీపంలో 14 ఎకరాల భూమిని కొనడం, అంతకుముందు వాడరేవులో మరో ఎకరం కొనుగోలు తరువాత ఏర్పడిన వివాదాలు ఇంకా ఉండటంపై వీరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు క్షుణ్ణంగా విచారించి, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు: ఎం.శేషగిరిరావు, గ్రామీణ సీఐ, చీరాల మండలం

ఈ కేసును అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం. మృతుడి చరవాణి కోసం ఘటన జరిగిన ప్రాంతంలో వెతికిస్తున్నాం. అది లభ్యం కాకపోయినా కాల్‌డేటా తీశాం. ఘటన జరగకు ముందు ఎవరెవరితో మాట్లాడారనే దాన్ని పరిశీలిస్తున్నాం. ఎవరిపైనా అనుమానం ఉంటే ఆ వివరాలు చెప్పాలని కుటుంబ సభ్యులను కోరాం.



సంతమాగులూరు సర్కిల్ కార్యాలయం వద్ద మొక్క నాటుతున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

పల్లెల్లో ప్రశాంతత పెంపొందించాలి

సంతమాగులూరు: పల్లెల్లో ప్రశాంతతను పెంపొందించే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు సూచించారు. సంతమాగులూరు పోలీసు స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ సందర్భంగా శుక్రవారం సందర్శించారు. కేసుల పూర్వపరాలపై సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. ప్రమాదాల నివారణ, చోరీలు అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. సీఐ కె.వెంకట్రావు, సంతమాగులూరు, బల్లికురవ ఎస్సైలు ఎం.పట్టాభిరామయ్య, జీవీ.చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చీరాల, న్యూస్‌టుడే: తమ ఉద్యోగుల ఆరోగ్యంపై రైల్వేశాఖ ఎపుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఒంగోలు రైల్వే వైద్యశాల అదనపు చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రమణారావు పేర్కొన్నారు. చీరాల రైల్వేస్టేషన్ సముదాయంలో శుక్రవారం రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన అనంతరం రమణారావు మాట్లాడుతూ ఇక్కడి ఉద్యోగుల సౌకర్యార్థం ఇది నిర్వహించామన్నారు. సాధారణ పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. రైల్వే మేనేజర్ సింగయ్య, బాపట్ల మజ్దూర్ యూనియన్ కార్యదర్శి నరేష్, జూనియర్ ఇంజినీరు సురేష్ పర్యవేక్షించారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణం


పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు వచ్చిన వరద నీరు పారి పెదగంజాం బకింగ్‌హాం కాలువ పక్కన గ్రావెల్ రోడ్డు, చప్టా దెబ్బతింది. చప్టాపై నీరు పారుతున్న సమయంలో పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, సర్పంచి నక్కల కృష్ణ, అధికారులకు సూచించారు. ఏలూరి ఆదేశాల మేరకు సుబ్బారెడ్డి, కృష్ణల ఆధ్వర్యంలో శుక్రవారం యుద్ధ ప్రాతిపదికన దెబ్బతిన్న చప్టాపైన, రోడ్డుపైన నాలుగు ట్రాక్టర్ల మట్టిని పోసి పూడ్చారు. దానిపై 200 మీటర్ల పొడవునా పది టిప్పర్ల బేబి చిప్స్ డస్టును పరిచి, చదును చేశారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఆసోది సుబ్బారెడ్డి, సర్పంచి నక్కల కృష్ణ

మునిగిన మినుము రైతులు

మార్టూరు, ఇంకొల్లు, పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే:



ద్రోణాదుల వద్ద నల్లగా మారిన పంటకొచ్చిన మినుము పైరు

ఆరుగాలం శ్రమించి పండించిన పంట ఇంటికి చేరుకుంటుందనుకున్న తరుణంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు పూర్తిగా దెబ్బతిని, అన్నదాతలను కంటతడి పెట్టిస్తోంది. వాయుగుండం ప్రభావంతో అయిదు రోజులుగా కురుస్తున్న వానలకు పంటకొచ్చిన మినుము పైరు నల్లగామారి పూర్తిగా దెబ్బతింది. ఎకరాకు వేలాది రూపాయల పెట్టుబడి వెచ్చిన సాగుదారుల చేతికి చిల్లిగవ్వ దక్కని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు, ఇంకొల్లు మండలాల్లో మినుము సాగుకు అన్నదాతలు ఈఏడాది అధిక సంఖ్యలో మొగ్గు చూపారు. సుమారు మూడు వేల ఎకరాలకు పైగా సాగు చేశారు.

పంజాబ్ నుంచి ఆధునిక వంగడాలు

ద్రోణాదుల ప్రాంతానికి చెందిన రైతులు మంచి దిగుబడులు వస్తాయనే ఆశతో ఇతర రాష్ట్రాల నుంచి ఆధునిక మినుము విత్తనాలను దిగుమతి చేసుకున్నారు. పంజాబ్ రాష్ట్రం నుంచి కృష్ణా జిల్లా ఘంటసాలకు దిగుమతి అయిన విత్తనాలను క్వింటా రూ.20 వేలు చొపున కొనుగోలు చేసి, ఇక్కడి భూముల్లో వెద సాగు చేశారు. ఖరీఫ్‌కు ఉపయుక్తంగా ఉంటుందని భావించిన ద్రోణాదుల, తాటివారిపాలెం, బొల్లాపల్లి, ఇంకొల్లు ప్రాంతాల్లోని రైతులు విస్తారంగా వీటిని సాగు చేశారు. ముందుగానే వేలాది రూపాయల కౌలు చెల్లించి, వ్యవసాయానికి భారీగా పెట్టుబడి వెచ్చించారు. పంట చేతికందే సమయంలో వరుణ దేవుడు కరుణ చూపక వర్షానికి పూర్తిగా నాని, పంట మీదున్న విత్తనాలన్నీ దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. ఫలితంగా ఎకరాకు వెచ్చించిన రూ.45 వేల పెట్టుబడి దక్కదని వాపోతున్నారు. సుమారు మూడు వేల ఎకరాల్లో వెచ్చించిన పెట్టుబడి రూ.13.5 కోట్ల మేర నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

18 ఎకరాల్లో సాగు చేశాను: ముప్పరాజు ఉదయ్, ద్రోణాదుల



ఖరీఫ్ సాగుకు అనువుగా ఎకరాకు 12-15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే ఆశతో ఘంటసాల నుంచి ప్రత్యేకంగా క్వింటా రూ.20 వేల చొప్పున మినుము విత్తనాలు కొనుగోలుచేసి, ఇక్కడ భూముల్లో వెద పెట్టాం. సాధారణ రకాలు ఎకరాకు 6-9 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తాయి. ఈ రకం ఎకరాకు 12-15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనే ఆశతో ఎకరాకు రూ.18 వేల కౌలు ముందుగా చెల్లించి, సాగుకు దిగాం. ఎకరాకు వ్యవసాయం, పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు, కూలి కలుపుకొని రూ.45 వేలు పెట్టుబడి పెట్టాం. పంట మీదున్న పైరుపై అయిదారు రోజులు వానజల్లులు ఎడతెరిపి లేకుండా కురవడంతో చేలోనే తడిసి ముద్దయింది. నేను ఒక్కడినే 18 ఎకరాల్లో పంజాబ్ నుంచి దిగుమతి చేసుకున్న నూతన వంగడాన్ని సాగు చేశాను. వానలకు మినుము రైతులు కోలుకోలేని దెబ్బతగిలింది.

పట్టణంలో పల్లె.. భవానీ కూడలి

అద్దంకి, న్యూస్‌టుడే

పట్టణ పరిధిలోని భవానీ కూడలి ప్రాంతంలో సమస్యలు పేరుకున్నాయి. పంచాయతీ స్థాయి నుంచి 13 ఏళ్ల క్రితం నగర పంచాయతీగా రూపొందినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందడం లేదు. మట్టి రహదారులు, వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలిచే వీధులు, పక్కా కాలువలు ఏర్పడని సందులు కొనసాగుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు ఓటర్లు కరిగిపోతున్నారు. అనంతరం ప్రజా ప్రయోజనాలను పాలకులు విస్మరిస్తున్నారు. అధికభాగం పేదలు నివసించే భవానీ కూడలికి అనుసంధానంగా ముజావారిపాలెం, కలవకూరు డొంక, కొత్త దామావారిపాలెం, రాములవారివీధి వంటివి ఉన్నాయి. చారిత్రక నేపథ్యం కలిగిన పెద్దమసీదు నామ్ రహదారిపై ఉంది. రెండు రాష్ట్రీయ మార్గాలు.. నామ్ ఎక్స్‌ప్రెస్ రహదారి, అద్దంకి-సంతమాగులూరు రాష్ట్రీయ రహదారులను కలిసేది ఇక్కడే. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఉత్తర అద్దంకికే తలమానికంగా నిలిచే భవానీ కూడలి అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించడం లేదు. తాత్కాలిక ప్రయోజనాలు మాత్రమే కల్పిస్తూ కీలకమైన సమస్యల్ని వదిలేశారు.



బురదమయంగా కలవకూరు డొంక రోడ్డు

నేటికీ బురదలోనే నడక

భవానీ కూడలికి అనుసంధానంగా ఉన్న రామాలయం వీధిలో భారీ వర్షం కురిస్తే నీటి పారుదల సాఫీగా జరగదు. పక్కా కాలువల నిర్మాణం జరగక పూర్వం వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చేది. రహదారుల్ని ఎత్తు పెంచి, రోడ్లపై కురిసిన వర్షపు నీరు నేరుగా కాలువలోకి చేరేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే సమయంలో కలవకూరు డొంక పూర్తిగా మట్టి రహదారిగా ఉంది. నిరంతరం ఇటుక బట్టీలకు, పొలాలకు వెళ్లే కూలీలు, చిరు వ్యాపారులు దీని పైనే నడుస్తుంటారు. వర్షాకాలంలో బురదలోనే ప్రయాణించాల్సి వస్తోందని వాపోతున్నారు.

నీటి పారుదల లేదు



మూడు దశాబ్దాల నుంచి ఇక్కడే ఉంటున్నాం. భారీ వర్షం కురిసిందంటే నీరు మొత్తం రోడ్డుపైనే నిలుస్తోంది. మోకాళ్ల లోతు నీళ్లలో నడవాల్సి ఉంటుంది. మహిళలకు బాగా ఇబ్బంది. ఎన్నోసార్లు మొరపెట్టుకోగా పక్కా కాలువలు కట్టారు. రహదారులు ఎత్తు పెంచకపోవటం వల్ల మురుగు నీటి పారుదల కష్టంగా మారింది. **- షేక్ మస్తాన్‌బీ, గృహిణి, రాములవారివీధి, అద్దంకి**

వీధి దీపాలు వెలగవు



ఆటోలు, ట్రాక్టర్లు, ఇటుక బట్టీలకు వెళ్లే కూలీలు ఇటువైపుగా నడిచి వెళుతుంటారు. బురదలో వెళ్లాలంటే ఇబ్బంది. రాత్రి సమయంలో వీధి దీపాలు వెలగవు. చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. పాములు సంచరిస్తుంటాయి. ఒక్కోసారి 'మేం పట్టణంలో ఉంటున్నామా' అనే అనుమానం కలుగుతుంది. సైడు కాలువలు నిర్మించలేదు. 300 మీటర్ల పొడవు కలిగిన ఈ రహదారిలో అధికభాగం పేదలే. మూడేళ్ల క్రితం ఇక్కడ ఇంటి స్థలం కొని, ఇల్లు నిర్మించుకున్నా.
- షేక్ ఆదాం సాహెబ్, పండ్లవ్యాపారి, కలవకూరు రోడ్డు, అద్దంకి

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

మార్టూరు, పర్చూరు, కారంచేడు (మార్టూరు), యద్దనపూడి, చినగంజాం, ఇంకొల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పల్లెపండగ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసిందని తెదేపా మండల అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, నల్లపనేని రంగయ్యచౌదరి అన్నారు. శుక్రవారం పర్చూరు బోడవాడ, ద్రోణాదుల, మున్నంగివారిపాలెం తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. పర్చూరులో రూ.కోటి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఎంపీడీవోలు ప్రద్యుమ్నకుమార్, వై.శ్రీనివాసరావు, ఈవో ఆర్డీ రామాంజనేయులు, అబీద్‌జావేద్ తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

✦ చినగంజాం మండలం పల్లెపాలెంలో రూ.17 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంటు రోడ్డుకు సర్పంచి సైకం మణి టెంకాయలు కొట్టారు. ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, ఏఈ కె.రామచంద్రుడు ఈవోఆర్డీ సుబ్బారావు పాల్గొన్నారు.

✦ ఇంకొల్లు మండలం భీమవరం, గంగవరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీవో శ్రీనివాసరావు భూమి పూజ నిర్వహించారు. ఉపాధి ఏపీఎం రేణుక, పీఆర్ఏఈ అనంద్ తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల, సంతమాగులూరు, అద్దంకి, జే పంగులూరు, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలో నిర్వహించిన పల్లెపండగలో రూ.80 లక్షల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. తెదేపా నేత మేదరమెట్ల శ్రీనివాసరావు ఏపీవో కోటేశ్వరి పాల్గొన్నారు. సంతమాగులూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈవోఆర్డీ శివరామప్రసాద్, నాయకులు అట్లా పెదవెంకటరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పల్లెపండగలో భాగంగా అద్దంకి, జే పంగులూరు, బల్లికురవ మండలాల్లో రూ.1.90 కోట్ల విలువైన సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

అర్థశాస్త్ర అధ్యాపకురాలికి డాక్టరేట్

చీరాల: సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గారపాటి మంజులాదేవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ప్రకాశం జిల్లాలో ఒక అధ్యయనం అనే అంశంపై డాక్టరేట్ పొందినట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.పుష్పరాజు తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్‌లో రజతం

చీరాల, న్యూస్‌టుడే: గోవాలో ఈనెల 14వ తేదీ నుంచి 18 వరకు జరిగిన పవర్‌లిఫ్టింగ్ జాతీయ స్థాయి పోటీల్లో చీరాలకు చెందిన అన్నదాత యజ్ఞప్రసాద్ రజత పతకం సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తాడివలస దేవరాజు తెలిపారు. మాస్టర్స్ 93కేజీల విభాగంలో రాష్ట్రం తరఫున బరిలోకి దిగిన యజ్ఞప్రసాద్ 157.5 కేజీల బరువునెత్తి ద్వితీయస్థానం కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ప్రసాద్‌ను జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు కుమారి నంద, చిన్న, అంబేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, తదితరుల అభినందించారు.

రీ- సర్వే పూర్తయిన గ్రామాల్లో అవగాహన

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్వహించిన రీ -సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. 22న దేవరపల్లి, 23 అడుసుమల్లి, 24 గర్నెపూడి, 25 గొల్లపూడి గ్రామాల్లో సభలు ఉంటాయని చెప్పారు. సమస్యలపై వినతులు అందించాలని కోరారు.

అవీ ఇవీ

భరద్వాజకు ఘన నివాళి

మార్టూరు, న్యూస్‌టుడే: జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ వర్ధంతిని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అమ్మ ఆశ్రమంలో రావూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంఘ నేతలు మచ్చా అనంతాచారి, వెంకటేశ్వరాచారి, గుంటుపల్లి చందు, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు.

మేదరమెట్లలో వైద్యశిబిరం

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల ఎస్టీ కాలనీలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి చిట్టిబాబు రోగులను పరీక్షించి, వారికి అవసరమైన మందులు అందించారు. హెచ్ఈవో బ్రహ్మానందం, సిబ్బంది సుశీల పాల్గొన్నారు.

మునగాకులో పోషకాలు

చీరాల అర్బన్, మేదరమెట్ల, యద్దనపూడి, కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: మునగాకులో పోషకాలు మెండుగా ఉన్నాయని, దీన్ని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కుముద్వతి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఉన్న గట్టువారి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై తల్లులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మునగాకుతో చేసిన పదార్థాలు ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్త జె.జ్యోతి, వైద్యసిబ్బంది సునీత, రాధా గ్రేస్, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

✦ కొరిశపాడు మండలం తిమ్మనపాలెంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేదరమెట్ల పీహెచ్‌సీ వైద్యురాలు నిఖిలారెడ్డి, సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, పద్మజ పాల్గొన్నారు.

✦ కారంచేడు, యనమదల గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మునగాకు వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు ఎన్.సుమలత, సీహెచ్.సుజాత వివరించారు.

తోటవారి ధర్మసత్రం పరిశీలన

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాంలోని తోటవారి ధర్మసత్రాన్ని బాపట్ల జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంటు కమిషనర్ సూర్యప్రకాష్‌రావు శుక్రవారం పరిశీలించారు. సత్రం భూమికి సంబంధించి జిల్లా కేంద్రంలోని గ్రీవెన్‌సెల్‌లో సలాంఖాన్ ఇచ్చిన అర్జీ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించినట్లు అసిస్టెంటు కమిషనర్ తెలిపారు. సత్రం నిర్వహణకు సంబంధించిన వివరాలను సర్పంచి రాయని ఆత్మారావు, ఉప సర్పంచి చెరుకూరి రాఘవయ్య, తెదేపా నాయకులు టి.జయరావు, ఎం.రామసుబ్బారావు, బి.సతీష్, షేక్ నబీషా, పి.పార్థసారథి, టి.బాపయ్య, భావనారాయణస్వామి అభివృద్ధి కమిటీ సభ్యుడు వలివేటి రామానుజమ్ ఏసీకి వివరించారు. అందరి అభిప్రాయాలను సేకరించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఏసీ తెలిపారు. కొత్తపాలెం సర్పంచి ఆసోది బ్రహ్మానందరెడ్డి, దేవాదాయ శాఖ ఒంగోలు ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, చినగంజాం ఆలయాల ఈవో మీనిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం స్థానికుల అభ్యర్థన మేరకు చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద శిథిలావస్థకు చేరిన పురాతన శ్రీకోదండ రామాలయాన్ని పరిశీలించారు.

అన్నదాన సత్రం నూతన కమిటీ ఎంపిక

శింగరకొండ(అద్దంకి): శింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి విశ్వబ్రాహ్మణ సత్రం నూతన కమిటీ ఎంపిక శుక్రవారం నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి వీరయ్యాచారి, కోశాధికారిగా దేవరకొండ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గోళ్లపాటి వెంకటాచారి, ఆళ్లగడ్డ వీరసుందరాచారి, కొండముది రమేష్ పాల్గొన్నారు.

ముగ్గురికి స్వల్ప గాయాలు

మేదరమెట్ల: చోదకుడు నిద్రమత్తులో కారు నడపడంతో కారు రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన కొరిశపాడు మండలం పి.గుడిపాడు సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. చెన్నై నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పడంతో ఇది చోటుచేసుకుంది. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

(c) eenadu